
సాక్షి
ఒడిశా

సోమవారం । 30 । జూన్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,06,366లు, బంగారం 14గ్రాముల 100 మిల్లీగ్రాములు, వెండి 29 గ్రాముల 400 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వేర్వేరు ప్రమాదాల్లో..

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ఆయా గ్రామాల్లో శోకం అలముకుంది.

- 8లో



ఆందోళనలకు సిద్ధం

గజపతి జిల్లా ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఈ సమావేశం నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

- మంత్రి కృష్ణ చంద్ర పాత్రో



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి కృష్ణ చంద్ర పాత్రో

భువనేశ్వర్: రాష్ట్రంలో రబీలో రైతులు పండించిన ధాన్యం సేకరణ ప్రక్రియ త్వరలో ముగియనుంది. ఈ నేపథ్యంలో అర్హత కలిగిన రైతుల నుంచి సేకరణను వేగవంతం చేయాలని రాష్ట్ర ఆహార సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో అధికారులను ఆదేశించారు. రైతుల ఫిర్యాదుల పరిష్కారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని సెలవు దినాల్లో కూడా పని చేయాలని ఆదేశించారు. స్థానిక రాష్ట్ర ఆహార సరఫరా సంస్థను ఆదివారం సందర్శించిన సందర్భంగా మంత్రి రబీ ధాన్యం సేకరణ పురోగతిని అధికారులతో చర్చించి సమీక్షించారు. ధాన్యం సేకరణ ప్రక్రియ చివరి దశలో ఉన్నందున లోపాలు లేకుండా కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో మంత్రి వివిధ జిల్లా కలెక్టర్లు, రైతులతో కూడా చర్చించారు. రాష్ట్ర పౌర సరఫరా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.సుదర్శన్ చక్రవర్తి ధాన్యం సేకరణ పురోగతిని వివరించారు. పలువురు సీనియర్ అధికారులు సమావేశానికి హాజరయ్యారు.

మజ్జిగౌరి దర్శనానికి భక్తుల తాకిడి



చెట్టు వద్దనే పూజలు చేస్తున్న మహిళలు



మజ్జిగౌరి అమ్మవారు

రాయగడ: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి క్యూలైన్లలో అమ్మవారి దర్శనార్థం వేచిఉన్న భక్తులకు దర్శనం అయ్యేసరికి సాయంత్రం పట్టింది. దీంతో భక్తులు విసుగెత్తి మందిరం ప్రాంగణంలో ఉన్న చెట్టు వద్ద మొక్కుబడులను తీర్చుకుని తిరిగి వెళ్లడం కనిపించింది. ఇదిలా ఉండగా ఇటు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ నుంచి కూడా అమ్మవారి దర్శనానికి భక్తులు రావడంతో మందిర ప్రాంగణం కిక్కిరిసిపోయింది. భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా మందిర నిర్వాహకులు తగు చర్యలు తీసుకున్నప్పటికీ కొందరు అవస్థలు ఎదుర్కొన్నారు.

'పనులు చేయకుండా డబ్బు స్వాహా'



ఫిర్యాదు తర్వాత యంత్రాల ద్వారా పనులు చేపట్టగా ప్రజలు వ్యతిరేకించగా నిలిచి పోయిన కాలువ పనులు

జయపురం: మహాత్మా గాంధీ గ్రామీణ రోజ్‌గార్ యోజనలో పనులు చేయకుండా రూ.12 లక్షల అవినీతి జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అవినీతిపై దర్యాప్తు జరపాలని జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి నారిగాం పంచాయతీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తమ పంచాయితీ ఉన్నతికోసం రూ.12 లక్షలు మంజూరు కాగా పనులు జరుపకుండానే స్వాహా చేశారని ఆరోపిస్తున్నారు. ఆ డబ్బుతో ఏయే పనులు చేపట్టారో తెలీడం లేదని నారిగాం మాజీ సర్పంచ్ ఆరోపించారు. మాజీ సర్పంచ్ నేతృత్వంలో నారిగాం ప్రజలు బొరిగుమ్మ బీడీఓను కలసి అవినీతిపై శనివారం ఆరోపించారు. మనొరెగ పథకంలో నారిగాం పంచాయతీ బటిగుడలో ఫీల్డ్ కాలువ నిర్మాణానికి రూ.6 లక్షలు మజూరు కాగా ఖంగారుతోట ప్రాంతంలో ఫీల్డ్ కాలువ కొరకు మరో రూ. 6 లక్షలు మంజూరు అయ్యాయని నారిగాం మాజీ సర్పంచ్ లక్ష్మణ వెల్లడించారు. అయితే ఆ రెండు పనులు చేయకుండా డబ్బు స్వాహా చేశారని ఆయన ఆరోపించారు. ఆ రెండు కెనాల్‌లు తవ్వేందుకు కూలీలకు దాదాపు రూ.3 లక్షలు కూలి డబ్బులు ఇచ్చారని, అయితే కెనాల్ పనులు జరగలేదని ఆరోపించారు. ఈ అవినీతిలో సర్పంచ్, పీఈఓ, ఏడీఈఓ, రామపాత్రొపుట్ పూజారిలు మమేకమై ఉన్నట్లు ఆరోపించారు. స్థానికులు ఫిర్యాదు చేస్తే ప్రాణాలు తీస్తామని బెదిరించారని ఆరోపించారు. శనివారం బీడీఓకు ఆరోపణల పత్రాన్ని అందజేశామ ని పేర్కొన్నారు. ఈ అవినీతిపై దర్యాప్తు జరపాలని విజిలెన్స్ అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు.

పూరీ శారదా బాలి వద్ద ..
తొక్కిసలాట

- ముగ్గురు భక్తులు మృతి
- పలువురికి గాయాలు

భువనేశ్వర్:

పూరీలోని శ్రీ గుండిచా ఆలయం సమీపం శారదా బాలి ప్రాంతంలో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ముగ్గురు మృతి చెందారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. పలువురు గాయ పడ్డారు. ఆదివారం తెల్లవారుజాము 4 గంటల ప్రాంతంలో ఈ విషాద సంఘటన జరిగింది. మృతులను బొలొగొడొకు చెందిన 36 ఏళ్ల బసంతి సాహు, 78 ఏళ్ల ప్రేమకాంతి మహంతి, బలిపట్నకు చెందిన ప్రభాతి దాస్‌గా గుర్తించారు. తెల్లవారు జామున 4 గంటలకు రథాలపై ఏకాంత సేవ తెరలు (పాహుండా) తెరిచిన వెంటనే స్వామి వారి తొలి దర్శనం కోసం వేచి ఉన్న భక్తుల ప్రాణాలు ఇసుక (బాలి)లో కలిసి పోయాయి. ఈ దర్శనం కోసం భక్తులు భారీగా గుమిగూడి ఉండగా ఈ దురదృష్టకర సంఘటన జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం చారుమళ్ల కలపతో నిండిన ట్రక్కు అకస్మాత్తుగా జనంలోకి ప్రవేశించింది. దర్శనం కోసం ఎగబాకుతున్న జనం ప్రాణ రక్షణ కోసం అకస్మాత్తుగా చెల్లాచెదురయ్యే ప్రయత్నంలో తొక్కిసలాట జరిగింది. ఈ సంఘటన జరిగిన సమయంలో 500 మందికి పైగా భక్తులు శారదా బాలిపై పరిచిన ప్లాస్టిక్ చాపలపై కూర్చుని ఉండగా కలప రవాణా ట్రక్కు దూసుకుని వచ్చింది. ఈ దూకుడులో 50 మందికి పైగా భక్తులు గాయపడ్డారు.

సెక్యూరిటీ గార్డు ఉండి ఉంటే..

దుర్ఘటన సమయంలో రథం దగ్గర సెక్యూరిటీ గార్డులు లేరు. భద్రతా ఏర్పాట్లు ఉండి ఉంటే ఈ సంఘటన జరిగి ఉండేది కాదని తొక్కిసలాటలో మృతి చెందిన బొలొగొడొ ప్రాంతానికి చెందిన బసంతి సాహు భర్త వాపోయాడు. సుమారు గంటన్నర సేపు సహాయం కోసం ప్రాధేయపడి నీరుగారి పోయామని భోరుమన్నాడు.

క్షమాపణ కోరిన ముఖ్యమంత్రి

శారదా బాలి ప్రాంగణంలో రథాలపై దేవుళ్ల దర్శనం సమయంలో జరిగిన తొక్కిసలాట కారణంగా ప్రాణాలు కోల్పోయిన భక్తుల కుటుంబాలకు ముఖ్యమంత్రి సంతాపం తెలియజేశారు. ఈ సంఘటనకు తాను, తన ప్రభుత్వం జగన్నాథ ప్రేమికులందరికీ క్షమాపణలు కోరుతున్నామని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అభ్యర్థించారు. ఈ ఆపత్కాలంలో దారుణమైన నష్టాన్ని భరించే శక్తిని మహాప్రభు జగన్నాథుడు బాధిత భక్తులకు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నానని అన్నారు. భద్రతా నిర్లక్ష్యంతో ఈ ఘోరమైన సంఘటన జరిగినట్లు ఆరోపణ. దీనిపై వెంటనే దర్యాప్తు జరిపించి బాధ్యులైన వారి వ్యతిరేకంగా నిర్దిష్టమైన చర్యలు తీసుకునేందుకు ఆదేశించారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న మృతురాలి భర్త

ఈ నిర్లక్ష్యం క్షమించరానిది
- నవీన్ పట్నాయక్

ఈ విచారకర సంఘటనపై విపక్ష నేత నవీన్ పట్నాయక్ మృతుల కుటుంబీకులకు సంతాపం తెలియజేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జన సమూహం నిర్వహణకు ప్రభుత్వ ఏర్పాట్లు లేకపోవడంతో ఈ విషాదం చోటు చేసుకుందని, తొలి రోజున శ్రీ జగన్నాథుని నంది ఘోష్ రథం కదలకపోవడాన్ని జగన్నాథుని ఇచ్ఛగా పేర్కొనడం ఆశ్చర్యంగా ఉందని వ్యాఖ్యానించారు. అధికార యంత్రాంగం పూర్తిగా బాధ్యత వహిరచాల్సి ఉందన్నారు. ఈ విచారకర సంఘటనల్ని దృష్టిలో పెట్టుకుని అడపా విజే, స్వర్ణ అలంకారం, నీలాద్రి విజే మును ముందు ఘట్టాల్లో అధికార యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి అవాంఛనీయ సంఘటనలు నివారించడంలో పూచీదారితనంతో వ్యవహరించాలని నవీన్ పట్నాయక్ తెలిపారు. ఈ సంఘటనపై రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సమగ్ర దర్యాప్తు జరిపి తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పూరీ శారదా బాలి ఘటనలో ముగ్గురు మృత్యు సంఘటనతో రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా శారదా బాలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్, కలెక్టర్ ప్రతిస్పందించారు. పరిస్థితి ఇప్పుడు అదుపులో ఉందని పూరి ఎస్పీ తెలిపారు. శారదా బాలిలో పోలీసు సిబ్బందిని మోహరించినట్లు తెలిపారు. ఈ దుర్ఘటనలో 3 మంది భక్తులు మరణించారు. ఆరుగురు గాయపడినట్లు ఈ అధికారులు తెలిపారు. పాహుండా తెరిచిన తర్వాత అకస్మాత్తుగా రద్దీ ఏర్పడి ఈ విషాదం చోటు చేసుకుందని కలెక్టర్ విచారం వ్యక్తం చేశారు.

బరిపద రథ యాత్ర ప్రత్యేకం




బరిపదలో రథ యాత్ర

- మహిళా సాధికారతకు తార్కాణం

భువనేశ్వర్: రథయాత్రలో మహిళలకు కీలక పాత్ర కల్పించి భగవంతుని సేవలో అందరికీ సమాన అవకాశం భావానికి ప్రాణం పోస్తోంది మయూర్‌భంజ్ జిల్లా బరిపద ప్రాంతంలో స్వామి రథ యాత్ర. పలు విభిన్నతలతో ఈ ప్రాంతంలో యాత్ర కొనసాగడం విశేషం. శ్రీ జగన్నాథుని సంస్కృతిలో ఇమిడి ఉన్న ఆచార వ్యవహారాలతో శ్రీక్షేత్రంలో వార్షిక రథ యాత్ర తరహాలో నిర్వహిస్తారు. పూరీలో యాత్ర జరిగిన మర్నాడు బరిపదలో శ్రీ జగన్నాథ రథ యాత్ర జరుగుతుంది. ఇక్కడ యాత్ర వరుసగా రెండు రోజులు కొనసాగడం మరో విభిన్నత. ఇక్కడ రథాలను మహిళలు లాగుతారు. ఇలా ఆచార వ్యవహారాల్లో వివాదరహిత నిర్వహణతో ఏటా రథ యాత్రని జరుపుకుంటున్న బరిపద ప్రాంతం ద్వితీయ శ్రీక్షేత్రంగా పేరొందింది. దేవీ సుభద్ర రథాన్ని మహిళలు మాత్రమే లాగుతారు. ఈ ఆచారం స్త్రీ సాధికారతను చాటుతుంది. భగవంతుని కార్యకలాపాల్లో లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తుంది. బరిపద రథ యాత్ర ఆధ్యాత్మిక సహవాసం, సాంస్కృతిక ఐక్యతతో జనం అంతా లీనం అయ్యే అనుభవాన్ని ప్రసాదిస్తుంది. ప్రఖ్యాత పూరి రథ యాత్ర తర్వాత రోజు బరిపదలో రథ యాత్ర జరుగుతుంది. ఇదో ప్రత్యేక సంప్రదాయం ద్వారా విభిన్నంగా ప్రాచుర్యం సంతరించుకుంది. రథ యాత్ర సాధారణంగా ఒక నిర్దిష్ట కాలంలో జరుగుతుంది. ఏటా ఆషాఢ కృష్ణ అమావాస్య రోజున జరిగే నేత్ర ఉత్సవంతో ప్రారంభమవుతుంది. ఆషాఢ శుక్ల ప్రతిపద నాడు ఉభా యాత్ర జరుగుతుంది. ఈ యాత్ర ప్రయాణానికి దేవతల సన్నద్ధతకు సంకేతం. ఆషాఢ శుక్ల ద్వితీయ నాడు శ్రీ మందిరం నుంచి వరుస క్రమంలో (గొట్టి పాహాండి) మూల విరాట్లు రథాల్ని అధిరోహించి శ్రీ గుండిచా మందిరానికి యాత్రగా తరలి వెళ్తారు. శారదా బాలి ప్రాంతంలో శ్రీ గుండిచా ఆలయం అడపా మండపంపై దేవతా మూర్తుల దర్శనం పరమ పావనంగా పరిగణిస్తారు. యాత్రలో ఆబాలగోపాలం మూల విరాట్లు ఆసీనులైన రథాల్ని లాగుతారు. తిరుగు యాత్ర బహుడా సందర్భంగా కూడ ఇదే శైలి కొనసాగుతుంది. బరిపదలో మాత్రం దేవీ సుభద్రని మహిళలు మాత్రమే లాగడం విభిన్నం. ఇక్కడ రథ యాత్ర రెండు రోజులు జరుగుతుంది. నేత్రోత్సవం తర్వాత రథాలపైకి దేవుళ్లని తరలించిన మర్నాడు రథాలు లాగుతారు. పూరీలో యాత్ర జరిగే రోజున బరిపదలో దేవతలు రథాల్ని అధిష్ఠించడంతో ముగుస్తుంది. మర్నాడు రథాలు లాగేంత వరకు దేవతల్ని రథాలపై సర్వులు దర్శించుకునేందుకు పూర్తి అవకాశం కల్పిస్తారు. రథాలపై దేవుళ్ల దర్శనం కోటి జన్మల పుణ్య ఫలంగా భక్తజనం భావిస్తారు.



బరిపదలో పూజలందుకుంటున్న దేవతా త్రయం



రథంపైకి తరలి వెళ్తున్న దేవీ సుభద్ర



రథాలపై దేవుళ్లని దర్శించుకుంటున్న భక్త జనం

ఎగ్జిబిషన్ సందర్శనకు పోటెత్తిన జనం



ప్రదర్శన తిలకించేందుకు పోటెత్తిన ప్రజలు

జయపురం: జయపురం మహారాజా రాజర్శి విక్రమదేవ్ వర్మ 157వ జయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం స్థానిక శ్రీవిక్రమ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ కళాశాలలో సిటీ ఆఫ్ విక్టరీ జయపుర ఫొటోఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. జయపురం రాజుల నాటి ఫొటోలను తిలకించేందుకు సందర్శకులు పోటెత్తుతున్నారు. ఆదివారం అనేక మంది యువకులు, ముఖ్యంగా వివిధ కళాశాలల విద్యార్థులు భారీగా తరలివచ్చి ఫొటో ప్రదర్శనను తిలకించారు. ఇన్‌టెక్ కొరాపుట్ చాప్టర్, శ్రీవిక్రమ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ కళాశాల జయపురం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫొటో ప్రదర్శనలో జయపురం మహారాజుల కాలం నాటి ఫొటోలను తిలకించిన వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి ప్రదర్శన చూడటం ఇదే ప్రథమమంటున్నారు. ఇక ముందు కూడా ఎంతో చారిత్రిక నేపథ్యం ఉన్న జయపురం సామ్రాజ్యంపై ఫొటో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తే చరిత్రను తెలుసుకొనేందుకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు.



ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థినులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



చెట్టును ఢీకొన్న బైకు పక్కనే యువకుల మృతదేహాలు

రాయగడ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. జిల్లాలోని బిసంకటక్ సమితి పాయికొడాకులుగుడ గ్రామ సమీపంలో ఈ ఘటన ఆదివారం జరిగింది. మృతులు సమితిలోని డిమిరినెలికు గ్రామానికి చెందిన మనోజ్ సరక (30), గహా హుయిక (28)గా పోలీసులు గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను బిసంకటక్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడిని చికిత్సకోసం ఆస్పత్రికి తరలించారు. డిమిరినెలికు గ్రామానికి చెందిన మనోజ్, గహా, హడి పిడికకలు ఒకే బైకుపై తమ గ్రామం నుంచి మునిగుడ వెళ్తున్న సమయంలొ పాయికొడాకులుగుడ గ్రామ సమీపంలో బైకు అదుపుతప్పి రోడ్డుకు పక్కనే ఉన్న ఒక చెట్టును బలంగా ఢీకొంది. ఈ ఘటనలొ ఇద్దరు సంఘటన స్థలం వద్దే మృతి చెందగా హడి పిడికక గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ గణాంకాలతోనే నిధుల కేటాయింపు



మాట్లాడుతున్న గణాంకాల విభాగం ఉపసంచాలకులు కులమణి రౌలో

- పర్లాకిమిడిలో 19వ జాతీయ గణాంకాల దినోత్సవం

పర్లాకిమిడి: జాతీయ గణాంకాల వల్ల దేశంలో వ్యవసాయం, భారీ నీటి పథకాలు, ప్రధాన మంత్రి సఫలయోజనా పథకం, జాతీయ నమూనా, కృషి జన గణాంకాలతోనే వచ్చే బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు జరుగుతాయని జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో 19వ జాతీయ గణాంకాల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా దివంగత ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహాలనోబిస్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసి కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ గణాంకాల దినోత్సవాన్ని 2007 నుండి దేశవ్యాప్తంగా ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర జన్మదినం నాడు జరుపుకుంటారని గుర్తు చేశారు. దేశ సామాజిక, ఆర్థైతిక, వార్షిక, నీతి అయోగ్ పథకాలు తయారు చేయడానికి జాతీయ గణాంకాలు దోహద పడతాయని డిప్యూటీ డైరెక్టర్ కులమణి రౌతో అన్నారు. కార్యక్రమాన్ని జిల్లా ప్రణాళికా, గణాంకాల విభాగం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకోగా, అతిథులుగా సబ్ కలెక్టర్ అనుప్ పండా, జిల్లా గణాంకాల డిప్యూటీ డైరెక్టర్ కులమణి రవుతో, ఎస్‌కేసీజీ కళాశాల ఎకానమిక్స్ అధ్యాపకులు సంజయ్ కుమార్ సాహు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

వీడిన రామగిరి హత్య కేసు మిస్టరీ

- ఇద్దరు నిందితులు అరెస్టు
- హత్యకు దారితీసిన భూవివాదం

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి సమితి రామగిరిలో ఈ నెల 23వ తేదీన కడమాసింగి గ్రామానికి చెందిన రామచంద్ర నాయక్ (35) దారుణ హత్యకు గురయ్యారు. శవానికి రాళ్లను కట్టి నువాసాహి డ్యాంలో విసిరేశారు. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న రామగిరి పోలీసులు హత్యంతో సంబంధం ఉన్న ఇద్దరు నిందితులను శనివారం అరెస్టు చేశారు. రాణిపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జ్యోతింద్ర పండా సమక్షంలో నిందితులను ఆదివారం ప్రవేశపెట్టి విలేకరుల సమావేశంలో వివరాలు తెలియజేశారు. ఈ నెల 22వ తేదీ నుంచి తన తమ్ముడు రామచంద్ర నాయక్ కనబడుట లేదని అన్నయ్య బరున్ కుమార్ నాయక్ రామగిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ రామచంద్ర నాయక్ ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలోనే కడమాసింగి గ్రామానికి సమీపంలో నువాసాహి డ్యాంలో మృతదేహం ఉన్నట్టు గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు శవాన్ని బయటకు తీసి వాకబు చేయగా అది రామచంద్రనాయక్‌దిగా నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతుని మెడమీద, తలపై బలమైన గాయాలు ఉండడంతో హత్యగా పోలీసులు నిర్ధారించారు. పరారీలో ఉన్న నిందితులైన అనాఘా గ్రామానికి చెందిన అతుల్ ప్రసాద్ బెహర్ దోళాయి, కరంజపడ గ్రామానికి చెందిన బిశ్వభాను ప్రధాన్‌ను రామగిరి పోలీసులు అరెస్టు చేసి మర్డర్ సీనును రీక్రియేట్ చేశారు. పోలీసుల దర్యాప్తులో తేలిందేమంటే ఒక భూవివాదం విషయమై రామచంద్రనాయక్‌ను హత్య చేయాలని నిందితులు పన్నాగం పన్నినట్టు తెలియవచ్చింది.

హత్య ఎలా చేశారంటే ..

తొలుత రామచంద్ర నాయక్‌ను తలపై రాళ్లతో కొట్టి, తరువాత గొడ్డలితో మెడపై వేటువేశారు. తరువాత పొదల్లో శవాన్ని దాచిపెట్టారు. అనంతరం ఏం చేయాలో పాలుపోక అతుల్ ప్రసాద్ దళ బెహారా తన మామయ్యను పిలిచి సలహా అడిగాడు. జూన్ 22వ తేదీ రాత్రి సమీపంలో మృతదేహాన్ని నువాసాహి డ్యాంకు తీసుకెళ్లి శవానికి రాళ్లు కట్టి విసిరివేసి పారిపోయినట్టు నిందితులు దర్యాప్తులో అంగీకరించినట్టు జిల్లా ఎస్పీ తెలియజేశారు. 25వ తేదీన డ్యాంలో తేలిన శవానికి వైద్యులు పోస్టుమార్టం చేయడం.. రామచంద్ర నాయక్ తలపై బలమైన గాయాలు ఉన్నట్టు పీఎం రిపోర్టులో డాక్టర్లు ధ్రువీకరించారు. నిందితులు మృతుని మొబైల్‌ను కూడా ధ్వంసం చేసినట్టు ఎస్పీ చెప్పారు. అయితే డ్యాం వద్ద దొరికిన మొబైల్‌ను డాటా తీసి పోలీసులు నిందితుల నంబర్లు సేకరించి మొబైల్ ట్రాక్‌తో పట్టుకోగలిగారు. నిందితుల వద్ద నుండి ఒక గొడ్డలి, మెడకు చుట్టిన తువ్వాలు, రాళ్లు, తాడును స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ జ్యోతింద్ర నాథ్ పండా వెల్లడించారు. కేసు దర్యాప్తులో సబ్ డివిజనల్ పోలీసు అధికారి అమితాబ్ పండా, ఓఐసీ డి.గజపతి దొర, ఏఎస్సై సంతోష్ కుమార్ బెహరాలు కీలక పాత్ర పోషించినట్టు చెప్పారు.



విలేకరుల ఎదుట నిందితులను ప్రవేశ పెట్టిన పోలీసులు

క్లుప్తంగా

ఏకాంత సేవ సమాచారం లేదు: సేవాయత్


రామచంద్ర దాస్ మహా పాత్రో

భువనేశ్వర్: రథాలపై ఏకాంత సేవకు సంబంధించి ఎలాంటి సమాచారం లేదని, ఈ మేరకు భక్తులకు ముందస్తు సమాచారం జారీ చేసి ఉంటే ఇంతటి ఘోరం జరిగేది కాదని సీనియర్ సేవాయత్, శ్రీ మందిరం మాజీ పాలక మండలి సభ్యుడు రామచంద్ర దాస్ మహా పాత్రో విచారం వ్యక్తం చేశారు. ఏకాంత సేవకు సంబంధించి భక్తులకు ముందుగానే సమాచారం ఇవ్వాలని, కానీ అది జరగలేదని తెలిపారు. భక్తులకు కనీస సమాచారం అందజేసేందుకు అనుబంధ కేంద్రంలో ఏ ఒక్కరు అందుబాటులో లేరని ఆరోపించారు.

పాము కాటుతో ఇద్దరికి అస్వస్థత

రాయగడ: రెండు వేర్వేరు ఘటనల్లో పాముకాట్లకు గురై ఇద్దరు అస్వస్థతకు గురయ్యారు. జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి పర్శాలి పంచాయతీలోని నిరుగుండి గ్రామానికి చెందిన తటక టక్రి భార్య సస్మిత కళ్యాణసింగుపూర్‌లో రథయాత్రను చూసేందుకు శనివారం వెళ్లారు. అదే గ్రామంలో గల తన కన్నవారింట్లో రాత్రి ఉండిపోయింది. ఆదివారం తెల్లవారున కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలో గల నది వద్దకు వెళ్లింది. అదే సమయంలో పాము ఆమెను కాటు వేసింది. ఇంటికి వచ్చి తమ కుటుంబీకులతో విషయాన్ని చెప్పింది. వెంటనే ఆమెను కళ్యాణసింగుపూర్ హాస్పిటల్‌లో చికిత్స కోసం చేర్పించారు. చికిత్సను అందించిన వైద్యులు పాముకాటుకు గురైన మహిళ ఆరోగ్యం కుదుటుగా ఉందని చెప్పారు. కళ్యాణసింగుపూర్ సమితి పరిధిలో గల సెరిగుమ్మ పంచాయతీలోని మండాపుట్ గ్రామానికి చెందిన నచిక రఘు అనే వ్యక్తికి పాము కాటు వేసింది. కళ్యాణసింగుపూర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు.

ముఖ్యమంత్రి కొత్త ప్రిన్సిపల్ సెక్రటరీగా శాశ్వత్ మిశ్రా


శాశ్వత్ మిశ్రా

భువనేశ్వర్: 1996 సంవత్సరపు ఐఏఎస్ బ్యాచ్ అభ్యర్థి శాశ్వత్ మిశ్రా ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులయ్యారు. మరో వైపు పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వినీత్ అగర్వాల్‌ని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం ఆఫీసరు ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా, పూరీ జిల్లా కలెక్టరు సిద్ధార్థ శంకర స్వంయిని సాధారణ పాలన విభాగం ఆఫీసరు ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా బదిలీ చేశారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

రాయగడ: సదరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల బాలాజీ మెడికల్ స్టోర్స్‌లో ఇటీవల జరిగిన దొంగతనానికి సంబంధించి పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బి.హేమంత్ కుమార్, షేక్ బాష, బి.వెంకటేష్ ఉన్నారు. వారి నుంచి రూ.15,580 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలియజేశారు. ఈ నెల 26వ తేదీన అర్ధ రాత్రి ప్రధాన రహదారి వద్ద గల బాలాజీ మెడికల్ స్టోర్స్‌లో చోరీ జరిగింది. దుకాణం షట్టర్‌ను గ్యాస్ పైపులతో కట్ చేసి దుండగులు లోపలకు చొరబడి క్యాస్ కౌంటర్‌లో గల సుమారు 12 వేల రుపాయల నగదును చోరీ చేసినట్లు బాధితుడు చిన్నారి సురేష్ కుమార్ సదరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసి శనివారం కోర్టుకు తరలించారు.

రథం లేని రథయాత్ర


నబరంగ్‌పూర్ జిల్లాలో రథం లేకుండా రథ యాత్ర నిర్వహిస్తున్న గిరిజనులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితి పట్కి గ్రామ పంచాయతీలో జరిగిన రథయాత్ర విమర్శలకు దారి తీసింది. ఇక్కడ పాత రథం పాడైపోవడంతో గిరిజనులు కొత్త రథం నిర్మాణానికి ఏర్పాట్లు చేశారు. అందుకు అవసరమైన కలప 10 ట్రాక్టర్ల ద్వారా తెస్తుండగా ఈ ఏడాది మార్చి 30న అధికారులు పట్టుకున్నారు. సరైన పత్రాలు లేనందున సీజ్ చేశారు. దేవాలయ కమిటీ విజ్ఞప్తితో ఉచితం సేవకి వచ్చిన ట్రాక్టర్లు కూడా సీజ్ అయ్యాయి. నేటికీ వాటిని వదలకపోవడంతో అందరికీ ఈ విషయం చెప్పాలనే ఉద్దేశంతో గిరిజనులు రథం లేకుండా రథయాత్ర చేశారు.

మత్స్య, కూర్మ అవతారంలో జగన్నాథ, బలరాములు


రాయగడ:కూర్మావతారంలో జగన్నాథుడు, పక్కనే శుభద్ర, బలభద్రుడు


పర్లాకిమిడి:మత్స్య, కూర్మావతారంలో జగన్నాథ, బలభద్రులు

పర్లాకిమిడి: పట్టణంలోని గుండిచామందిరంలో ఆదివారం శ్రీజగన్నాథ, బలరాములు మత్స్య, కూర్మావతారంలో భక్తులకు కనువిందు చేశారు. సెలవు దినం కావడంతో మధ్యాహ్నం నుంచి చట్టుపక్కల గ్రామాల ప్రజలు స్వామివారి దర్శనానికి భారీగా విచ్చేస్తున్నారు.

రాయగడ: రథాయాత్ర మూడో రోజైన ఆదివారం జగన్నాథుడు కూర్మావతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. గుండిచా మందిరంలో కొలువైయున్న దేవతామూర్తులు ప్రత్యేక పూజలను అందుకుంటున్నారు. సుప్రభాత సేవతో ప్రారంభమైన పూజా కార్యక్రమాలు స్వామివారు రోజుకో రూపంలో భక్తులకు దర్శన భాగ్యం కలిగేలా సేవాయుతులు అలంకరిస్తున్నారు. స్వామివారి దశవతారాల్లో భాగమైన కూర్మావతారాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. గుండిచా మందిరం ప్రాంగణం భక్తులతో కిటకిట లాడుతుంది. ఇదిలాఉండగా సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భజన, సంకీర్తనలు కళాకారులచే నిర్వహించారు.

బాలికల అక్రమ రవాణా అడ్డుకున్న పోలీసులు


నబరంగ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌డీపీఓ కృష్ణచంద్ర బోత్ర

కొరాపుట్: బాలికల అక్రమ రవాణాని నబరంగ్‌పూర్ జిల్లా పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఎస్‌డీపీఓ కృష్ణచంద్ర భాత్ర ఈ కేసు వివరాలు ప్రకటించారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం కొడింగా పోలీస్ స్టేషన్ పరిధిలోని గొట్టిబెడ గ్రామంలో రఘు బోత్ర తన చెల్లెలితో పాటు ముగ్గురు బాలికలు గ్రామంలో అదృశ్యమయ్యారని 24న ఫిర్యాదు చేశారు. తనకు ఈ గ్రామంలో కొందరు బాలికల అక్రమ రవాణా వ్యాపారం చేస్తున్నట్లు అనుమానం ఉందని పేర్లు ఇచ్చారు.

అనుమానిత వ్యక్తుల ఫోన్లపై నిఘా ఉంచడంతో తమిళనాడు రాష్ట్రంలో ఈ ముగ్గురు బాలికలు ఉన్నారని ఖరారు చేసుకున్నారు. వెంటనే తమిళనాడు పోలీసులకు సమాచారం ఇచ్చి బాలికలను రక్షించారు. ఈ బాలికలను అక్రమ రవాణా చేసిన నబరంగ్‌పూర్ పట్టణానికి సమీపంలో పకనా గుడకి చెందిన ప్రతాప్ హరిజన్, తెంతుల కుంటి సమితి కమత గ్రామానికి చెందిన బికాష్ నాయక్, బాధిత బాలికల గ్రామానికి చెందిన ఖగుపతి జానీ, మితుల జానీలను అరెస్ట్ చేశారు.

గవర్నర్ ప్రగాఢ సంతాపం

భువనేశ్వర్: పూరీ గుండిచా మందిరం శారదా బాలి ప్రాంగణంలో తొక్కిసలాట చోటుచేసుకొని పలువురు మృతి చెందడంపై రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. వారి ఆత్మలకు శాంతిచేకూర్చాలని భగవంతున్ని వేడుకుంటున్నట్టు పేర్కొన్నారు.

దివ్య దర్శనం



శ్రీ గుండిచా శారదా బాలి ప్రాంగణంలో రథాలపై మూల విరాట్లు బలభద్ర స్వామి, దేవీ సుభద్ర, శ్రీ జగన్నాథుడు భక్తులకు దివ్య దర్శనం భాగ్యం కల్పించారు. రథాలపై దేవతాత్రయం బొడొ సింగారొ అలంకరణలో సుగంధిత పుష్ప అలంకరణలో శోభిల్లారు. ఆదివారం రాత్రి సుమారు 10 గంటల వరకు భక్తులకు రథాలపై ఈ దివ్య దర్శనం ప్రాప్తించింది. శ్రీ గుండిచా అడపా మండపానికి తరలించేంత వరకు నిరవధికంగా దర్శించుకున్నారు.

– భువనేశ్వర్

ఆందోళనలకు ఉద్యోగులు సిద్ధం


ప్రభుత్వ రెవెన్యూ ఉద్యోగుల సాధరణ పరిషత్ సమావేశంలో అమలా సంఘం నాయకులు

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్ కార్యాలయం వద్ద గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో ఆదివారం ఉదయం ఒడిషా రెవెన్యూ అమలా సంఘం సాధారణ పరిషత్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శివప్రసాద్ పండా పర్యవేక్షించగా, జుధిష్టర్ రణసింగ్ అధ్యక్షత వహించారు. ఇతర అతిథులుగా సాధారణ కార్యదర్శి సంతనుకుమార్ మిశ్రా, బాబూలాల్ పూజారీ, భైరవ్ పట్నాయిక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బసంత పసుపురెడ్డి, సుశీల్ కోరా హాజరయ్యారు. గజపతిలో పనిచేస్తున్న రెవెన్యూ మినిస్టీరియల్ ఉద్యోగుల పది డిమాండ్లు నేరవేర్చేందుకు వచ్చే రోజుల్లో ఆందోళన చేయడానికి సిద్ధం కావాలని సభ్యులు తీర్మానించారు. జిల్లాలో మినిస్టీరియల్ ఉద్యోగుల క్యాడర్ పునర్నిర్మాణం, జూనియర్ అసిస్టెంట్లకు బేసిక్ పే 9 లెవల్‌కు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులకు పీఎం ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల జారీపై నాయకులు చర్చించారు. రెవెన్యూ ఉద్యోగులు అపరిష్కృతంగా మిగిలిపోయిన డిమాండ్లు నెరవేరేందుకు జూలై 7 నుంచి జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవ్వాలని, జూలై 14 నుంచి జిల్లావ్యాప్తంగా రెవెన్యూ ఉద్యోగులు విధులను బహిష్కరించాలని నాయకులు తీర్మానించారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించండి

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భక్త చరణ దాస్, పీసీసీ ప్రహరి అజయ లల్లు


అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

జయపురం: కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం జయపురంలో నిర్వహించిన రాజ్యాంగాన్ని పరిరక్షించండి ర్యాలీకి, సమావేశానికి విశేష స్పందన లభించింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భక్త చరణ దాస్, పీసీసీ ప్రహరి అజయ లల్లును జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర ఉల్క స్వాగతం పలికారు. వీరి నేతృత్వంలో వేలాది మంది కార్యకర్తలు అంబాగుడ నుంచి 26వ జాతీయ రహదారిలో బైక్ ర్యాలీతో జయపురం తీసుకువచ్చారు. పార్టీ రాష్ట్ర నేతలకు జయపురంలో ఘన స్వాగతం పలికారు. 26వ జాతీయ రహదారి పారాబెడ జంక్షన్‌లో గల డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విక్రమ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసి బహిరంగ సభావేదిక వద్దకు చేరుకున్నారు. నేతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై నిప్పులు చెరిగారు. మోదీ పాలనలో రాజ్యాంగానికి ముప్పు వాటిల్లుతుందని, రాజ్యాంగ పరిరక్షణకు పార్టీ శ్రేణులు, ప్రజాస్వామ్యవాదులు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. సభా కార్యక్రమాలు జరుగుతుండగా భారీవర్షం పడటంతో కొంతసమయం అంతరాయం కలిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీనాక్షి బాహిణీపతి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శశిభూషణ పాత్రో, తదితరులు పాల్గొన్నారు.

జయపూర్ రైల్వేస్టేషన్లో సౌకర్యాల లేమి!


వంతెన క్రింద ప్రయాణికులు


వర్షంలో పరుగులు తీస్తున్న ప్రయాణికులు

- ప్రయాణికుల పాట్లు!

కొరాపుట్: వర్షాకాలం వస్తే చాలు జయపూర్ రైల్వే స్టేషన్లో ప్రయాణికులు అవస్థలు పడుతుంటారు. ఆదివారం సాయంత్రం జయపూర్ రైల్వే స్టేషన్లో హిరాఖండ్ రైలు ఎక్కడానికి వచ్చిన వందలాది ప్రయాణికుల బాధలు సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారాయి. పేరుకే పెద్ద స్టేషన్ అయినప్పటికీ ప్లాట్‌ఫారం మీద ఉండదానికి స్థలం లేదు. అతి పెద్ద ప్లాట్‌ఫారం ఉన్నా అందుకు తగ్గ షెడ్స్ లేవు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఉన్న షెడ్‌లో జాగా లేకపోవడంతో ప్రయాణికులు రక్షించుకోవడానికి పాదచారుల వంతెన కింద, ఫుడ్‌స్టాల్ ముందు నిల్చోవలసి వస్తుంది. దేశంలో రైల్వే ఆధునీకరణ జరిగినా ఇక్కడ మాత్రం చేపట్టలేదు. కనీసం రైళ్ల వచ్చి వెళ్లే సమాచారం తెలిపే డిస్‌ప్లే బోర్డు లేదు. చిన్న స్టేషన్లలో రైళ్ల బోగీలు ఆగే స్థలం చెప్పే బోర్డుల వ్యవస్థ కూడా లేకపోవడం దయనీయం. రైలు వస్తే ప్రయాణికులు బోగిల కోసం పరుగులు తీయాల్సిందే. ఈ స్టేషన్ మీదుగా విశాఖ పటన్నం, భువనేశ్వర్, కోల్‌కతా, రౌర్కెలాలకు పది రైళ్ల నడుస్తున్నాయి. సుమారు లక్షా 50 వేల జనాభా ఉన్న జయపూర్ పట్టణంతో పాటు సమీప వందలాది గ్రామాలు, ప్రక్కనే నబరంగ్‌పూర్, మల్కన్‌గిరి జిల్లాల ప్రజలు ఇదే స్టేషన్ మీద ఆధార పడుతున్నారు. పక్క రెండు జిల్లాలలో ఎక్కడా రైల్వే లైన్ లేక పోవడంతో జయపూర్ మాత్రమే గత్యంతరం. ఇంతటి రద్దీ ఉన్న స్టేషన్లో రైలు ఎక్కలంటే ప్రయాణికులు యుద్ధం చేయాల్సి ఉంటుంది.


పూరీ మరణాలకు బాధ్యులెవరు..?


ఓపెన్ జీపుపై ఊరేగింపులో పీసీసీ చీఫ్ భక్త చరణ్ దాస్, ఎంపీ సప్తగిరి, ఎమ్మెల్యే తారా ప్రసాద్, సీఎల్పీ అధ్యక్షుడు రాం ఖడం,అజయ్ కుమార్ లల్లూ

కొరాపుట్: పూరీలో జరిగిన మరణాలకు ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాలని పీసీసీ డిమాండ్ చేసింది. ఆదివారం ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. రథయాత్రను బీజేపీ పాలకులు చెడగొట్టారని విమర్శించారు. ఇప్పటికే ముగ్గురు చనిపోయారని ప్రభుత్వం చెబుతుందన్నారు. కానీ మరో 600 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న విషయం పాలకులు మర్చిపోయారన్నారు. అసలు ఈ యాత్రని పర్యవేక్షణ చేస్తున్నదెవరో ప్రజలకు చెప్పాలన్నారు. అనేక సార్లు సమీక్ష జరిపిన తర్వాత ప్రశాంతంగా జరగాల్సిన యాత్ర విషాదంగా మారిందన్నారు. విషయం పై రాజకీయాలు చేయాల్సిన సమయం కానందున తాము సంయయనం వహిస్తున్నామని భక్త చరణ్ దాస్ ప్రకటించారు. అంతకు ముందు కలహండి జిల్లా నుంచి పార్టీ రాష్ట్ర పరిశీలకుడు అజయ్ కుమార్ లల్లూ తో కలసి నబరంగ్‌పూర్ వచ్చారు. మహిళల హక్కుల కోసం పోరాటం చేస్తున్న ఉద్యమ నాయకురాలు కాధంబని త్రిపాఠి ఏర్పాటు చేసిన బాధిత మహిళల సమావేశానికి హాజరయ్యారు. అనంతరం జిల్లా దాటి కొరాపుట్ జిల్లాలోనికి ప్రవేశించారు. జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక్‌లు ఘనస్వాగతం పలికారు. వందలాది బైక్‌లతో ర్యాలీ చేశారు.

రైలు నుంచి జారిపడిన యువకులు

- ఒకరికి గాయాలు



గోపాలపట్నం: ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ నుంచి ఇద్దరు యువకులు జారిపడగా, వారిలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన సింహాచలం రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో పవిత్రా దాస్, సగ్రామ్ దాస్ ప్రయాణిస్తున్నారు. సింహాచలం రైల్వేస్టేషన్‌లో ఈ రైలుకు హాల్ట్ లేదు. అయితే రైలు స్టేషన్‌లో నెమ్మదిగా వెళ్తున్న సమయంలో వారు ప్రమాదవశాత్తు కిందపడిపోయారు. అక్కడే ఉన్న ఆర్పీఎఫ్ సిబ్బంది గమనించి వారిని కాపాడారు. వారిలో ఒకరికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. ఈ యువకులు ఒడిశా రాష్ట్రం డెంకనాల్ జిల్లా కుకట గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. బెంగళూరు వెళ్తున్న వీరు పుట్‌బోర్డుపై కూర్చోవడం వల్ల కళ్లు తిరిగి పడిపోయి ఉంటారని పోలీసులు అంచనా వేస్తున్నారు. అదృష్టవశాత్తు ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై పడటం వల్ల ప్రాణాపాయం తప్పిందని ఆర్పీఎఫ్ ఎస్ఐ సూరజ్ కుమార్, ఏఎస్ఐ జి.శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ డి.జగదీష్ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి


కొరాపుట్: సంఘటన స్థలంలో ఉన్న మృతదేహం


మల్కన్‌గిరి: కలిమెల ఆరోగ్య కేంద్రంలో మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి తెల్‌రాయ్ పంచాయతీకి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కలిమెల నుంచి మోటు వైపు బైక్ వెళ్తుంది. వెనుక నుంచి ట్రక్కును ఢీకొంది. బైక్‌పై ఉన్న వ్యక్తి రోడ్డు పక్కన రాళ్లపై పడిపోయాడు. ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు కలిమెల పోలీసులకు సమాచారం ఇచ్చారు. కలిమెల ఐఐసీ ముకుందో మేల్కా ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడు ఎక్కడ నుంచి వస్తున్నాడో తెలియలేదు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. మృతదేహన్ని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సోమవారం ఎవరైనా మృతదేహం కోసం వస్తే పోస్టుమార్టం పూర్తిచేసి అప్పగిస్తామని ఐఐసీ తెలిపారు.

వ్యాన్‌ఢీ కొని..

కొరాపుట్: కొరాపుట్ జిల్లా లమ్తాపుట్ సమితి కొంచనా గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. భారీ వర్షంలో వ్యాన్ వస్తుంది. అదే సమయంలో ఓ యువకుడు (30) చెట్టు కింద తన బైక్ ఆపి నిల్చున్నాడు. వ్యాన్ అదుపు తప్పి ఆ యవకుడిని ఢీకొంది. సంఘటన స్థలంలోనే యువకుడు మృతి చెందాడు. వ్యాన్ కూడా అదుపు తప్పి బోల్తాపడింది. వెంటనే లమ్తాపుట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతుడు నందపూర్ సమితి పడేల్ గ్రామ వాసిగా పోలీసులు అనుమానిస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి పారువా గ్రామ పంచాయతీ ఇంద్రానగర్ వద్ద ఆదివారం సాయంత్రం జగిరిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్కూటిని గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపాయింది. ఈ ఘటనలో స్కూటీపై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రాయిఘర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అతని వద్ద ఎటువంటి ఆధారాలు లేవు. మృతదేహాన్ని రాయిఘర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుని ఎన్నికల ప్రక్రియ ఆరంభం

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ కొత్త రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ మండలి సభ్యులను ఎన్నుకునే ప్రక్రియ ఆదివారం రాష్ట్రంలో ప్రారంభమైందని బీజేపీ రాష్ట్ర ఎన్నికల అధికారి, పార్లమెంటు సభ్యుడు ప్రతాప్ చంద్ర షడంగి తెలిపారు. జూలై 1 నాటికి ఈ ప్రక్రియ పూర్తి అవుతుంది. మూడు రోజుల పాటు కొనసాగే సంస్థాగత ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణ కోసం బీహార్ పార్లమెంటు సభ్యుడు సంజయ్ జైస్వాల్‌ను కేంద్ర ఎన్నికల అధికారి పరిశీలకునిగా నియమితులైనట్లు పేర్కొన్నారు. సమైక్యత స్ఫూర్తితో రాష్ట్ర బీజేపీని సమర్థంగా నడిపించగల నాయకుడి కోసం పార్టీ ప్రజాస్వామ్య ప్రామాణికలతో సమగ్ర ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. అట్టడుగు స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు నాయకుల ఎన్నిక ఇదే పద్ధతిలో కొనసాగుతుంది. ఆదివారం ఓటర్ల జాబితా జారీ చేశారు.

సోమవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు గడువు కల్పించారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు నామినేషన్లను పరిశీలన ముగించి సాయంత్రం 4 గంటలు సరికి అభ్యర్థులకు ఎన్నికల చిహ్నాలను కేటాయించి తుది జాబితా వెల్లడిస్తారు.

పోలింగ్

జూలై 1న ఉదయం 10 గంటలకు పోలింగ్ ప్రారంభం అవుతుంది. మధ్యాహ్నం 12 గంటల వరకు ఓట్ల పోలింగ్ నిరవధికంగా కొనసాగుతుంది. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు ఫలితాలు ప్రకటిస్తారు. ఈ ఎన్నికలు రాష్ట్ర బీజేపీకి చాలా కీలకం. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత వ్యవస్థని బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ సన్నాహాలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ తొలి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించి ఇటీవలే మొదటి సంవత్సరం పూర్తి చేసుకుంది. రాష్ట్రంలో స్థానిక, మండల, జిల్లా కమిటీల ఎన్నికలు పూర్తయ్యాయి. ఈ ఏడాది జనవరిలో 37 సంస్థాగత జిల్లాలకు ఎన్నికలు నిర్వహించి 23 జిల్లాలకు కొత్తగా ఎన్నికైన అధ్యక్షుల పేర్లను పార్టీ ప్రకటించింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి ఎన్నిక తర్వాత జాతీయ అధ్యక్షుడి ఎన్నికలో పాల్గొనడానికి రాష్ట్ర శాఖ అర్హత పొందుతుంది. బీజేపీ ప్రతి మూడేళ్లకు ఒకసారి సంస్థాగత ఎన్నికలను నిర్వహిస్తుంది. ఇది స్థానిక స్థాయిలో ప్రారంభమై జాతీయ అధ్యక్షుడి ఎన్నికతో ముగుస్తుంది.

పూరీ కలెక్టర్, ఎస్పీ బదిలీ

- డీసీపీ, కమాండెంట్‌పై సస్పెన్షన్‌వేటు
- మృతుల బంధువులకు రూ. 25 లక్షల పరిహారం
- అభివృద్ధి కమిషనర్ ఆధ్వర్యంలో విచారణ

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని రథయాత్రలో అపశృతి చోటు చేసుకుంది. రద్దీ కారణంగా ముగ్గురు భక్తులు మరణించారు. ఈ సంఘటనపై ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తీవ్రంగా స్పందించారు. తక్షణమే ఇద్దరు అధికారులను బదిలీ చేయగా మరో ఇద్దరు అధికారుల్ని సస్పెండ్ చేశారు. ఈ సంఘటనపై రాష్ట్ర అభివృద్ధి కమిషనర్ ఆధ్వర్యంలో పాలనాపరమైన విచారణకు ఆదేశించారు. ఈ సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా క్షమాపణ కోరారు. తొక్కిసలాటలో మరణించిన భక్తుల బంధువులకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. పూరీ జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంటుని బదిలీ చేశారు. కొత్త జిల్లా కలెక్టరుగా చంచల్ రాణా నియమితులయ్యారు. పినాక్ మిశ్రాకు కొత్త పోలీసు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు డీసీపీ విష్ణు పతి, కమాండెంట్ అజయ్ పాఢిలను సస్పెండ్ చేశారు.

నెల రోజుల్లో విచారణ పూర్తి


శారదా బాలి ప్రాంతం తొక్కిసలాట సంఘటనలో మృత్యు సంఘటనపై దర్యాప్తు నెల రోజుల లోపు పూర్తి అవుతుందని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వి రాజ్ హరిచందన్ తెలిపారు. దోషులుగా తేలిన వారికి కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు. పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంటుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పినాక్ మిశ్రా మాట్లాడుతూ తనకు ఇంతకు ముందు ఉన్న కొద్దిపాటి అనుభవాన్ని ఉపయోగించుకుంటానని తెలిపారు. రథాలు, యాత్ర నిర్వహణ బాధ్యతలు అరవింద్ అగర్వాలాకు అప్పగించారు. రథ యాత్రలో పోలీసు ఏర్పాట్ల బాధ్యతను ఐపీఎస్ సౌమేంద్ర ప్రియదర్శి నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

చేపలు పట్టిన నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర


కుంద్రా వద్ద చేపల కోసం గేలం వేస్తున్న ఎంపీ బలబద్ర మజ్జి

కొరాపుట్: వినూత్న పనులు చేయడంలో ముందుండే బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మజ్జి మరోసారి వైరల్ అయ్యారు. కొరాపుట్ జిల్లా కుంద్రా సమితి బగ్దేరి నుంచి వస్తుండగా ఒక గిరిజనుడు ఎర వేసి చేపలు పట్టడాన్ని చూశారు. వెంటనే తన కాన్వాయ్ ఆపి ఆ గిరిజనుడుతో ఎర ఎలా వేస్తున్నావో అడిగి తెలుసుకున్నారు. తాను కూడా గిరిజనుడేనని, బాల్యంలో తమ గిరిజన గ్రామంలో ఇలా చేపలు పట్టేవాడినని గుర్తు చేసుకున్నారు. అనంతర కొంత సేపు ఎర వేసి చేపలు పట్టి బాల్యం గుర్తు చేసుకున్నారు.

పొలం వద్దకే మన్ కీ బాత్


నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితిలో పొలం గట్టుపై ఏర్పాటు చేసిన ల్యాప్ టాప్


ప్రధాని ప్రసంగం వింటున్న గిరిజనులు

కొరాపుట్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించే కార్యక్రమం పొలం పనుల వద్దకు చేరింది. ఆదివారం మాన్ కి బాత్ 123వ ఎడిషన్ జరిగింది. నబరంగ్‌పూర్ జిల్లాలో విస్తారంగా వర్షాలు పడుతుండడంతో రైతులు ఖరీఫ్ పనుల్లో బిజీగా ఉన్నారు. వేకువ జామున ఇంటి నుంచి పొలాలకు వెళ్లి తిరిగి రాత్రికి వస్తున్నారు. ప్రధాని సందేశం గిరిజనులకు అందాలనే ఉద్దేశంతో బీజేపీ కార్యకర్తలు వినూత్న ఆలోచన చేశారు. నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితిలో ల్యాప్ ట్యాప్‌ను పొలం వద్దకు తీసుకువెళ్లి మాన్ కి బాత్ కార్యక్రమాన్ని వినిపించారు.

క్లుప్తంగా

రైతు సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

రేగిడి: రైతుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఈ మేరకు ఆదివారం రేగిడి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ పనులు ప్రారంభమైనప్పటికీ సాగునీటి కాలువలకు ఆధునికీకరణ పనులు జరగకపోవడంతో ఈ ఏడాది సాగునీటి ప్రాజెక్టుల ద్వారా పంటపొలాలకు నీరందే పరిస్థితి కష్టమేనన్నారు. నాగావళి నది కుడి ఎడమ కాలువల ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. ఖరీఫ్‌కు రైతులకు అవసరమైన వరి విత్తనాలను మంచి రకాలను అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సాయన్న, ఆకులలోవకట్టగెడ్డ, రేగిడి, తునివాడ చానల్ పూర్తిగా కుచించుకు పోయినప్పటికీ అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, కన్వీనర్ వావిలపల్లి జగన్మోహన్‌రావు, రాజాం నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కెంబూరు వెంకటేశ్వరరావు, వావిలపల్లి శశిభూషణరావు పాల్గొన్నారు.

గెడ్డలో పడి యువకుడి మృతి



సత్యనారాయణ(ఫైల్)

తెర్లాం: బహిర్భూమికి వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు గెడ్డలోపడి మృతి చెందాడు. తెర్లాం మండలంలోని నందబలగ పంచాయతీ పరిధి జనార్దనవలస గ్రామంలో ఆదివారం ఉదయం ఈ సంఘటన జరిగింది. దీనికి సంబంధించి ఎస్సై సాగర్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జనార్దనవలస గ్రామానికి చెందిన గుల్లిపల్లి సత్యనారాయణ(31) ఆదివారం ఉదయం ఇంటి నుంచి బహిర్భూమికి వెళ్లి కాలుజారి గెడ్డలో పడిపోయాడు. ఆ సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో నీటిలోపడి ఊపిరిడక మృతి చెందాడు. కొంతసేపటికి గ్రామానికి చెందిన మరో వ్యక్తి బహిర్భూమికి అక్కడికి వెళ్లగా గెడ్డలో వ్యక్తి పడిపోయి ఉండడాన్ని చూసి బయటకు తీశాడు. అయితే అప్పటికే సత్యనారాయణ మృతిచెంది ఉండడంతో గ్రామంలోకి వెళ్లి మృతుడి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులకు విషయాన్ని తెలియజేయగా వారంతా వచ్చి చూసి బావురుమన్నారు. మృతుడికి తండ్రి లక్ష్మణ, తల్లి వెంకటమ్మ ఉన్నారు. సత్యనారాయణ బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లో ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి డ్యూటీ నుంచి ఇంటికి వచ్చి భోజనం చేసి పడుకున్నాడని, ఆదివారం ఉదయం లేచి బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి గెడ్డలోపడి మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు భోరున విలపిస్తున్నారు. మృతదేహానికి కుటుంబసభ్యులు, గ్రామపెద్దల సమక్షంలో శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. మృతుని తండ్రి ఫిర్యాదుపై ఎస్సై సాగర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అల కల్లోలం..!

- వేటకు అల్పపీడనం దెబ్బ
- ప్రతికూల వాతావరణంతో కొనసాగని చేపల వేట
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులు



ప్రతికూల వాతావరణంతో పతివాడబర్రిపేటలో ఉధృతంగా వస్తున్న కెరటాలు



తీరానికే పరిమితమైన బోట్లు



వలలకు మరమ్మతులు చేసుకుంటున్న మత్స్యకారులు

పూసపాటిరేగ: సముద్రమే సర్వస్వంగా జీవిస్తున్న గంగపుత్రులకు ప్రతికూల వాతావరణంతో వేట సాగక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన రెండు నెలలుగా వేట నిషేధం కారణంగా సముద్రంలో వేట నిలిపివేశారు. తీరా వేట ప్రారంభించిన నాటి నుంచి వాతావరణంలో మార్పులతో అల్పపీడనం కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారడం తదితర కారణాలతో కొంత సమయం వేట సాగలేదు. తాజాగా గత మూడురోజులుగా అల్పపీడనం కారణంగా కెరటాలు ఉధృతిగా రావడంతో చేపల వేటకు వెళ్లినా చేపలు వలకు చిక్కని పరిస్థితి నెలకొందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరంలో గాలులు వీయడం, అలలు ఎగిసి పడుతుండడంతో వేటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. జిల్లాలో పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 27 కిలోమీటర్ల మేర తీరప్రాంతం విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో 21 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో సుమారు 21 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. వేటపై ప్రత్యక్షంగా 6 వేల మంది, పరోక్షంగా 15 వేల మంది ఆధారపడి జీవిస్తున్నారు. సంప్రదాయ బోట్లు, ఇంజిన్‌బోట్లు రెండు మండలాల్లో 1120 వరకు ఉన్నాయి. వాటిలో 885 బోట్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజిస్టర్ అయి ఉన్నాయి. ఈ ఏడాది వేట నిషేధం తరువాత వేట ప్రారంభించినప్పటి నుంచి చేపలు వలకు చిక్కడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. నిషేధ సమయంలో కుటుంబాలు ఎలాగో నెట్టుకొచ్చినా మళ్లీ కష్టాలు ప్రారంభమయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా అలల ఉధృతి ఎక్కువై బోట్లు తీరానికే పరిమితమయ్యాయి. వేట లేకపోవడంతో వలలకు మరమ్మతులు చేసుకుంటున్నామని పలువురు మత్స్యకారులు చెబుతున్నారు. వేట నిషేధ సమయంలో భృతి మంజూరుకు నిబంధనల పేరిట చాలామంది మత్స్యకారులకు మత్స్యకార భరోసా నిలిపివేశారు. గత ప్రభుత్వంలో వేట చేసిన ప్రతి మత్స్యకారుడికి మత్స్యకార భరోసా మంజూరైంది. కానీ నేడు మత్స్యకారుల పరిస్థితి అయోమయంగా మారింది. గత ఏడాది కూడా మత్స్యకార భరోసా ఊసెత్తని సర్కారు నిబంధనల పేరిట ఈ ఏడాది చాలా మందికి కోత విధించింది. ఏడాదిలో సగం రోజులు ప్రకృతి వైపరీత్యాలు, మరి కొన్ని రోజులు తుఫాన్ హెచ్చరికలు, ప్రతి కూల వాతావరణంతో వేట సాగక ఇబ్బందులు పడుతున్నారు. మత్స్యకార జీవనవిధానంలో మార్పులకు సర్కారు ప్రత్యామ్నాయం ఆలోచించి వేట లేని సమయంలో తమను ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

అరకొరగా మత్స్యసంపద



వేట నిషేధసమయం తరువాత వేటకు వెళ్లినా చేపలు వలకు చిక్కడం లేదు. ప్రతి ఏడాది నిషేధం తరువాత చేపల వేట చేస్తే మత్స్య సంపద సమృద్ధిగా దొరికేది. కానీ ఈ ఏడాది నిషేధం తరువాత చేపల వేట సాగడం లేదు. వేటకు వెళ్లినా డీజిల్‌ఖర్చు కూడా రాని పరిస్థితి నెలకొంది. అల్పపీడనం కారణంగా మూడురోజులుగా వేట సాగలేదు.

– సూరాడ కొర్లయ్య, పతివాడబర్రిపేట

ప్రతికూల వాతావరణంతో ఇబ్బందులు



సముద్రంలో అల్పపీడనం ప్రభావంతో ప్రతికూల వాతావరణం నెలకొని అలల ఉధృతి పెరిగింది. వాతావరణంలో మార్పుల కారణంగా వేట చేయలేని పరిస్థితి. వేట సాగకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. వేటలేని సమయంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయం ఆలోచించి ఆదుకోవాలి.

– ఆకుల కాశీలు, పతివాడ బర్రిపేట

మద్యం వద్దు.. తాగునీరు ముద్దు

- సారిపల్లిలో వినూత్న ప్రచారం
- మద్యపాన నిసేధంపై ఇంటింటికీ కరపత్రాల పంపిణీ



మద్యపాన నిషేధం కోసం సారిపల్లిలో ఇంటింటికీ కరపత్రాల పంపిణీ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామంలో మద్యం ఏరులై పారుతోంది. బెల్టు షాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. ఎక్కడ చూసినా మద్యం లభిస్తోంది కానీ తాగునీరు మాత్రం దొరకడం లేదని గ్రామానికి చెందిన పలువురు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాలకులకు కనువిప్పు కలిగేందుకు గ్రామస్తులు వినూత్న రీతిలో ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ రాయి పైడమ్మ, ఎంపీటీసీ మజ్జి త్రివేణి ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ పర్యటించి మద్యపాన నిషేధంపై ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల పార్టీలకు అతీతంగా సమావేశం ఏర్పాటు చేశామని, ఆలయాల నిర్మాణంతో పాటు గ్రామాభివృద్ధికి పలు తీర్మానాలు చేశామన్నారు. పేదలను పీల్చిపిప్పి చేస్తున్న మద్యాన్ని గ్రామంలో అమ్మకూడదని హెచ్చరికలు కూడా జారీ చేశామన్నారు. అయినప్పటికీ కొందరు యథేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని మండిపడ్డారు. గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిసేధమే లక్ష్యంగా కరపత్రాల పంపిణీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. తాగునీరు దొరక్క ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, జల్ జీవన్ మిషన్‌లో భాగంగా మంజూరైన ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు కూటమి నాయకులు సహకరించాలని కోరారు.

ఇంటర్ విద్యార్థి మృతి



ఉదయరాజ్ (ఫైల్)

బొబ్బిలి: బాడంగి మండలం హరిజన పాల్తేరుకు చెందిన అలమండ ఉదయ రాజ్(16) అనే ఇంటర్ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో ఆదివారం దుర్మరణం చెందాడు. బాడంగి మండలానికి చెందిన అలమండ రవి బైక్ మెకానిక్ షాపు నిర్వహిస్తూ బొబ్బిలిలోనే స్థిరపడ్డాడు. రవికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ఉదయరాజ్ విశాఖలోని శశి కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సెలవుల సందర్భంగా ఇంటికి వచ్చిన ఉదయరాజ్ పాత బొబ్బిలిలోని తన స్నేహితుడిని కలిసి వస్తానని చెప్పి బైక్‌పై వెళ్లాడు. స్నేహితుడితో మాట్లాడి తిరిగి రాతిపనివారి వీధిలోని తన ఇంటికి వస్తుండగా పాత బొబ్బిలిలో ఉన్న గుంతల వద్ద అదుపు తప్పి కిందపడిపోవడంతో లారీ ఢీకొంది. దీంతో ఉదయ రాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు ప్రేమ్‌కుమార్ 8వ తరగతి చదువుతున్నాడు. తల్లి ఉష భర్తకు చేదోడు వాదోడుగా షాపు దగ్గర ఉంటోంది. ప్రమాద సమాచారం అందుకున్న ఎస్సై పి జ్ఞానప్రసాద్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని సీహెచ్‌సీకి తరలించారు.

చోరీ కేసులో రెండవ నిందితుడి అరెస్ట్

విజయనగరం క్రైమ్: విజయనగరం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2017లో డబ్బుల అపహరణ కేసులో రెండవ నిందితుడ్ని ఆదివారం అరెస్ట్ చేసినట్టు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ చెప్పారు. ఆ కేసులో బాధితుడు కర్రి రవీంద్ర రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి స్టేషన్ హౌస్ ఆఫీసర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టి, దర్యాప్తు పూర్తి చేశారు. ఆ కేసులో గుత్తి ప్రవీణ్ కుమార్, ఆర్.జయ ప్రకాష్ రెడ్డి, మహమ్మద్ అమీనుద్దీన్, చెల్లి రాజు, బూర రత్నాజీ, విశ్వనాథ్ రెడ్డి సంగీత కన్నన్‌లను ఇదివరకే అరెస్ట్ చేశారు. ఈ కేసులో రెండవ నిందితుడు తమిళనాడుకు చెందిన జీజే శ్రీనివాసులు పరారీలో ఉండగా ట్రాన్సిట్ వారెంట్‌తో విజయనగరం తీసుకువచ్చి జడ్జి ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి దుర్మరణం



నూకరాజు మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పీఎస్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని నటరాజ్‌కాలనీకి చెందిన నూకరాజు(41) దుర్మరణం చెందాడు. నూకరాజు ఇంటి నుంచి బైక్‌పై ధర్మపురి వెళ్లాడు. తిరిగొస్తుండగా మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టడంతో నూకరాజు కింద పడిపోగా తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి భార్య సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై అశోక్ తెలిపారు.

వైభవంగా పూర్ణాహుతి

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున స్వామికి ప్రాతః కాలార్చన పూజలనంతరం యాగశాలలో రామాయణంలోని పట్టాభిషేక హవనం చేసి పూర్ణాహుతి జరిపించారు. తరువాత స్వామి వెండి మంటపం వద్ద శ్రీ సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. నెలరోజుల పాటు యాగశాలలో నిర్వహించిన సుందరకాండ హవనానికి పుష్యమి నక్షత్రం సందర్భంగా పూర్ణాహుతి జరిపించామని అర్చకులు తెలిపారు.

పరామర్శ

నెల్లిమర్ల: నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో మద్దిలి గణేష్ ఇటీవల మృతి చెందగా, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆ కుటుంబాన్ని ఆదివారం కలిసి పరామర్శించారు. గణేష్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఆయన వెంట వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పతివాడ సత్యనారాయణ ఉన్నారు.

గిరిజన రైతు విలవిల..!

- అన్నదాత సుఖీభవ కోసం నిరీక్షణ
- ఖరీఫ్‌లో తప్పని ఆర్థిక వెతలు



పొలం దున్నుతున్న రైతు

సీతంపేట: ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. పంటలు పండించడానికి పెట్టుబడులు ఎలా అని రైతులు గిరిజన ఆందోళన చెందుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఈపాటికే పీఎం కిసాన్‌తో పాటు రైతు భరోసా నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యేవి. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. కూటమి ప్రభుత్వం ఇదిగో..అన్నదాత సుఖీభవ..అదిగో..అంటూ కాలం వెళ్లబుచ్చుతోంది తప్ప ప్రయోజనం లేకపోయిందని రైతులు పెదవి విరుస్తున్నారు. పోడు వ్యవసాయంలో పండించే పైనాపిల్, పసుపు, కొండచీపుళ్లు ఇతర అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేవు. ఈ పంటల ద్వారా ఆదాయాలు వస్తే కొంతమేర ఖరీఫ్ వ్యవసాయానికి పెట్టుబడులు పెట్టుకోవడానికి వీలుండేది. వాటికి కూడా సరైన మద్దతు ధరలు లేకపోవడంతో పంటలు ఎలా పండించుకోవాలో తెలియని పరిస్థితి ఉందని గిరిజన రైతులు వాపోతున్నారు. అన్ని విధాలా నష్టపోతున్న తమను ఆదుకునే దిక్కులేదని ఆందోళన చెందుతున్నారు. వాతావరణం అనుకూలించడంతో వరి, రాగులు, కంది, ఇతర కొండపోడు పంటలన్నీ వేసుకోవడానికి సరైన సమయం. తగిన పెట్టుబడి సాయం లేకపోవడంతో గిరిజన రైతులు డీలా పడుతున్నారు.

16,800 మంది రైతుల ఎదురుచూపు

సీతంపేట ఐటీడీఏ పరిధిలో 16,800 మంది కొండపోడు పట్టాలు కలిగిన రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులు. వైఎస్సార్‌సీపీ హయాంలో 25 వేల ఎకరాల్లో సాగు భూమిపై పూర్తిహక్కులు కల్పించి, సుమారు 17 వేల మందికి పట్టాలు ఇచ్చి రైతు భరోసా నిధులు రూ.13.500లు చొప్పున జమచేశారు. పీఎం కిసాన్ సాయం కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500లు కలిపి మొత్తం రూ.13,500ల మొత్తాన్ని రైతు ఖాతాల్లో జమచేశారు. ఇప్పటి ప్రభుత్వంలో ఖరీఫ్ పనులు ప్రారంభమైనప్పటికీ ఇంతవరకూ ఎటువంటి సాయం లేదు. గతేడాది కూడా ఒక్కపైసా ఇవ్వలేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో దుక్కులు దున్నడం, విత్తనాలు కొనుగోలు, నారుమడుల తయారీకి రైతులకు పెద్దమొత్తంలో నిధులు అవసరమవుతాయి. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏడాదికి రూ.20 వేలు అన్నదాత సుఖీబవ ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ప్రభుత్వం కొలువుదీరి ఏడాదైనా ఆర్థిక సాయం ఇంతవరకు అందడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

త్వరలో నిధుల జమ

త్వరలో అన్నదాత సుఖీభవ నిధులు అర్హులందరికీ జమ అవుతాయి. ఈ మేరకు విధివిదానాలు రూపొందాయి. ప్రభుత్వం విడుదల చేసిన నిధులను వ్యవసాయ పంటల సాగుకు వినియోగించాలి.

– ఎస్వీ గణేష్, పీఏవో, సీతంపేట ఐటీడీఏ

గతంలో ఖరీఫ్‌లో రైతు భరోసా వచ్చేది



గతంలో ఖరీఫ్ సీజన్ వచ్చిందంటే రైతుల ఖాతాల్లో నిధులు జమ అయ్యేవి. ఏడాదిగా ఎదురు చూపులే మిగిలాయి తప్ప ఎటువంటి ప్రయోజనం లేదు. ఆ సొమ్ముతో పెట్టుబడి పెట్టి పంటలు పండించే వాళ్లం.

– ఎస్.అబ్బాస్, రైతు, కుశిమి

అడపా మండపానికి..



పూల గుభాళింపుతో శ్రీ గుండిచా సింహ ద్వారం



శారదా బాలిలో రథాలకు చారుమళ్ల అమరిక



రథం పైనుంచి సుదర్శనుని దించుతున్న దృశ్యం



తాళ ధ్వజం నుంచి బలభద్ర స్వామి ఉత్సవ మూర్తులు రామ, కృష్ణుల్ని దించుతున్న దృశ్యం

భువనేశ్వర్: రథయాత్రలో భాగంగా శుక్రవారం బయల్దేరిన 3 రథాలు శ్రీ గుండిచా ఆలయం ఆవరణకు శనివారం చేరాయి. ఆదివారం మూడో రోజున రథాలపై మూల విరాట్టుల్ని దించి అడపా మండపానికి తరలించారు. శారదా బాలి ప్రాంతంలో నిలిచి ఉన్న రథాల పైనుంచి మూల విరాట్టుల్ని సురక్షితంగా దించేందుకు చారుమళ్లు అమర్చారు. తొలుత సుదర్శనుని దేవీ సుభద్ర రథం నుంచి దించి తదుపరి ఉత్సవ మూర్తులు, మూల విరాట్టుల్ని వరుస క్రమంలో (గొట్టి పొహండి) జాగ్రత్తగా దించి గుండిచా మందిరంలోకి తరలించడంతో అడపా విజే పూర్తయ్యింది. అంతకు ముందు గుండిచా మందిరంలో తిరు మంజన సేవ నిర్వహించారు. సోమవారం నుంచి అడపా మండపంపై భక్తులకు మూల విరాట్ల సేవ నిరవధికంగా లభిస్తుంది. దేవతా మూర్తుల్ని ఆహ్వానిస్తూ శ్రీ గుండిచా మందిరం పూల అలంకరణతో గుభాళించింది. సోమవారం మూల విరాటులు బలభద్రుడు, దేవీ సుభద్ర, శ్రీ జగన్నాథునికి శ్రీ ముఖ సేవ బొనొకొలగి నిర్వహిస్తారు.

సైబర్ వలకు చిక్కి నగదు పోగొట్టుకున్న బాధితుడు



బాధితుడు బిల్లకుర్తి ఉపేంద్రకుమార్

పాలకొండ రూరల్: ఓవైపు పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ ప్రజలు నేరగాళ్లు, హ్యాకర్ల బారిన పడుతున్నారు. తాజాగా పాలకొండ మండలం సింగన్నవలసకు చెందిన బిల్లకుర్తి ఉపేంద్రకుమార్‌కు సైబర్ వలకు చిక్కి నగదు పోగొట్టుకున్నాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 28 న సమీప గ్రామ సచివాలయానికి చెందిన ఓ కార్యదర్శి నంబర్ నుంచి ఓ 'లింక్' మెసేజ్ ఉపేంద్రకుమార్ వచ్చింది. గతంలో వలంటీరుగా పనిచేసిన క్రమంలో బహుశా కార్యదర్శి నుంచి ఈ లింక్ వచ్చి ఉంటుందని భావించి ఆ లింక్ ఓపెన్ చేశాడు. ఇంతలో సెల్ ఫోన్‌కు పలుమెసేజ్‌లు వరుసగా వస్తుండడంతో సెల్ స్విచ్ ఆఫ్ చేశాడు. అయితే అప్పటికే సెల్ హ్యాక్ కావడంతో స్నేహితులు, బంధువులకు పలు మెసేజ్‌లు వెళ్లాయి. తన ఆరోగ్య పరిస్థితి సరిగా లేదని ఆర్థిక సాయం చేయాలని ఈ మెసేజ్‌ల సారాంశంగా బాధితుడు తెలుసుకున్నాడు. ఇంతలో తన వ్యక్తిగత బ్యాంక్ ఖాతా ఇదే సెల్‌కు అనుసంధానం చేసి ఉండడంతో వరుసగా నగదు మాయం అవుతుండడం, సమాచారం సెల్‌ఫోన్‌కు మెజేజ్‌ల రూపంలో వస్తుండడంతో ఆందోళన చెందాడు. తన ప్రమేయం లేకున్నా రూ.56వేల పైచిలుకు నదగు పలు దఫాలుగా మాయం కావడంతో ఆదివారం స్థానిక పోలీసులు, సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేశాడు.

బియ్యం దొంగలకు భరోసా..!

- వారి జోలికి వెళ్లొద్దని అధికారులకు కూటమి నేతల హుకుం
- అధికారులు మౌనం దాల్చారని విమర్శలు



కొండ కిండాం కోళ్ల ఫారంలో నార సంచుల్లో పట్టుబడిన పీడీఎస్ బియ్యం (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: బొండపల్లి మండలంలో పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యం పట్టివేత సంఘటన జరిగి 24 రోజులవుతున్నా చర్యలు శూన్యం. పేదలకు అందాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టించిన దొంగలకు కూటమి నేతలు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టించిన వారి జోలికి వెళ్లొద్దని కూటమికి చెందిన నేతలు సంబంధిత శాఖ అధికారులకు హుకుం జారీ చేసినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుచేతనే అధికారులు మిన్నకుండిపోయినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అధికారం చేపట్టిన తొలినాళ్లలో కూటమి నేతలు ప్రగల్భాలు పలికారు. కానీ ఇప్పుడు పీడీఎస్ బియ్యం నేరుగా నారసంచులతోనే దొరికినప్పటికీ కిమ్మనకపోవడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. రేషన్ వాహనాల ద్వారా పీడీఎస్ బియ్యం పక్కదారి పడుతోందనే డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ చేపట్టామని కూటమి సర్కార్ గొప్పలు చెప్పింది. రేషన్ డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ చేపట్టిన మొదటి నెల ఆరంభంలోనే నార సంచులతో పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలించారు. ఇది పెద్ద ఎత్తున సంచలనమైంది.

బొండపల్లి మండలంలో పట్టుబడిన బియ్యం

పేదప్రజలకు అందించే పీడీఎస్ బియ్యం కొంత మంది వ్యాపారులు పెద్ద ఎత్తున పక్కదారి పట్టించారు. పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో విజిలెన్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. బొండపల్లి మండలంలోని కొండకిండాంలో గల కోళ్ల ఫారంలో 106 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, కిండాం అగ్రహారం మామిడి తోటలో 43 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం అధికారులు గుర్తించారు. రేషన్ దుకాణాల్లో ఉండాల్సిన పీడీఎస్ బియ్యం కోళ్ల ఫారం, మామిడితోటల్లోకి తరలించడం సంచలనమైంది. అయితే ఈ సంఘటన జరిగి 24 రోజులవుతున్నా వ్యాపారులు ఏ రేషన్ షాపు నుంచి తరలించారనేది అధికారులు ఇంతవరకు తేల్చలేదు. ఎంతసేపు 6 ఎ కేసులు నమోదు చేశామని చెప్పడం తప్ప. వ్యాపారులకు సహకరించిన రేషన్ డీలర్ ఎవరనే వివరాలు అధికారులు వెల్లడించలేదు. అయితే పీడీఎస్ బియ్యం ఏ రేషన్ షాపు నుంచి వెళ్లాయన్న విషయం సివిల్ సప్లైస్ అధికారులకు తెలిసినప్పటికీ కూతమి నేతలు బయటకు చెప్పవద్దని ఆదేశించారని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో బయటకు చెప్పడం లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. సంఘటన జరిగి ఇన్ని రోజులైనా సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకోకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి లేని పాలన అందిస్తామని కూటమి నేతలు గొప్పలు చెబుతున్నారు. కానీ పీడీఎస్ బియ్యం తరలింపు ద్వారా జిల్లాలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నా నోరు మెదపడం లేదు.

వ్యాపారులపై కోర్టులో కేసులు

పీడీఎస్ బియ్యం తరలించిన వ్యాపారులపై కోర్టులో కేసులు పెడతాం. బియ్యం తరలించిన రేషన్ డీలర్ల వివరాలు కూడా తెలిశాయి. వారిపై నిఘా పెట్టాం. వారిపై కూడా చర్యలు తీసుకుంటాం.

– కె.మధుసూదన్‌రావు, జిల్లా పౌరసరఫరాల అధికారి

'మధ్యతరగతి మందహాసం' పుస్తకావిష్కరణ



మధ్యతరగతి మందహాసం పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: బెహరా వెంకట సుబ్బారావు సర్వ లభ్యరచనల పుస్తకం 'మధ్యతరగతి మందహాసం' పుస్తకావిష్కరణ కార్యక్రమం అరసం జిల్లాశాఖ ఆధ్వర్యంలో జెడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం వేడుకగా నిర్వహించారు. కార్యక్రమానికి కలిగొట్ల సన్యాసిరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బహుభాషా గ్రంథకర్త డాక్టర్ వీవీవీ.రమణ మధ్యతరగతి గాథలు, వ్యథలను స్వయంగా పరిశీలించి, అనుభవించి రాసిన గొప్ప రచయిత బెహరా సుబ్బారావు అని ప్రశంసించారు. మన జీవితాల్లో జరుగుతున్న అనేక సంఘటనల సమాహారం మధ్యతరగి మందహాసమని విశిష్ట అతిథి, వ్యంగ్య కథల రచయిత డాక్టర్ కొచ్చర్లకోట జగదీష్ పేర్కొన్నారు. ప్రముఖ జర్నలిస్ట్ కేఎస్ఎస్ బాపూజీ కథలపై సమీక్ష చేస్తూ సునిశతమైన హాస్యాన్ని కథలలో జోడిస్తూ తాను చెప్పాల్సిన విషయాన్ని సున్నితంగా చెబుతూ ప్రతి కథకు గొప్ప కొసమెరుపులిచ్చారన్నారు. పుస్తక సంపాదకుడి సుబ్బారావు కుమారుడు మూర్తి మాట్లాడుతూ నాన్నగారి కథలు మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సామాజిక చైతన్యానికి దోహదపడ్డాయన్నారు. సుబ్బారావు కథలు మధ్యతరగతి మహాభారతమని, అటువంటి గొప్ప కథల పుస్తకాన్ని సుబ్బారావు పుత్రుడు మూర్తి పెద్ద గ్రంథంగా తీసుకురావడం తండ్రిరుణం తీర్చుకున్న కుమారుడిగా ధన్యుడయ్యాడని అరసం జిల్లా అధ్యక్ష్యుడు జీఎస్.చలం పేర్కొన్నారు. ప్రముఖ కవి, రచయిత రాజోలు నుంచి హాజరైన ఎం.ఎస్.సూర్యనారాయణ కథల మీద సమగ్రమైన విమర్శ రావాలని, ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన జరగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ సభా కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.